# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 23-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:130 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

బంగారం ధర
డబ్బు స్నోడికి మేలు
డబ్బు మార్పిడి.

నేచర్ కన్నెర
భారి మంచు తుపాను
జనవిద్రోహం.

చేతలు శూన్యం
మాటలు బాగున్నాయి
నేతల రంగు

నిషేదం మాంజా
కాటుతో పాటుచేటు
పక్షుల చావు.

నవ్వు ఆక్సిజన్
దుఃఖం కార్బన్ డై ఆక్సైడ్
చెట్టు ఆదర్శం



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

అమెరికా అధ్యక్షుడిగ
శ్వేత సౌధమెక్కె !
డొనాల్డ్ ట్రంపే మళ్లీ
అమెరికన్స్ కు దిక్కె !
ఆ ఉక్రెయిన్ యుద్ధాన్ని
ఆపలేనా నేనేమి !
మూడో ప్రపంచ యుద్ధం
అడ్డుకుంటానని హామీ !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


## మహాకుంభమేళాకు యూపీ సీఎం.. మంత్రులతో కలిసి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు



న్యూఢిల్లీ, జనవరి 22: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ లో మహా కుంభమేళా కొనసాగుతోంది. 45 రోజులపాటు సాగే ఈ మహాకుంభ మేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. తాజాగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సైతం మహాకుంభమేళాకు వెళ్లారు.

డిప్యూటీ సీఎంలు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్ సహా కేబినెట్ మంత్రులతో కలిసి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం.

## ఎంపీ కార్పస్ ఫండ్ ద్వారా సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ




నిజామాబాద్, జనవరి 22:నిజామాబాద్ లోని ఎంపీ కార్యాలయంలో అర్వింద్ ధర్మపురి బూత్ స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా పార్లమెంట్ పరిధిలోని 33 మంది బూత్ స్థాయి కార్యకర్తలకు బుధవారం రూ.13.65 లక్షల చెక్కులను అసెంబ్లీ కన్వీనర్లు, మండలాల అధ్యక్షుల చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ? చనిపోయిన, వివాహమైన, నూతన గృహ ప్రవేశం, హాస్పిటల్ బిల్లులు, తదితర కేసులకు తన ఫౌండేషన్ ద్వారా కార్యకర్తలకు తగిన సహాయం చేస్తానన్నారు. కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు ఎంపీ ధర్మపురి అరవింద్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్లు, మండలాల అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎంపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈరోజు దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డు ఇస్తాం- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్, జనవరి 22: అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. పేదలందరికీ కార్డులు ఇస్తామని, ప్రతిపక్షాలు ఆరోపించినట్లు ఎవ్వరూ భయపడొద్దని మంత్రి చెప్పారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు గ్రామసభలో ఉత్తమ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తులు అన్నీ పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈరోజు దరఖాస్తు ఇచ్చినా రేషన్ కార్డు ఇస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కాగా, తెలంగాణ వ్యాప్తంగా జనవరి 21 నుంచి గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈనెల 24 వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో పెద్దఎత్తున అప్లికేషన్లు వస్తున్నాయి. కాగా, ఈనెల 26న నుంచి అర్హులకు రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేయనుంది.

## కర్ణాటకలో ఘోర ప్రమాదం.. ట్రక్ బోల్తాపడి పది మంది దుర్మరణం..

న్యూఢిల్లీ, జనవరి 22:కర్ణాటకలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. యల్లాపుర సమీపంలో ట్రక్కు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో పది మంది దుర్మరణం పాలయ్యారు. మరో 15 మంది గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రులు సావనూర్ నుంచి యల్లాపుర సంతకు పండ్లను విక్రయించేందుకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఉత్తర కన్నడ జిల్లాలోని సావనూర్–హుబ్బళి రహదారిపై అటవీ ప్రాంతం మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ట్రక్కు డ్రైవర్ మరొక వాహనానికి దారి ఇచ్చే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి లోయలోకి దూసుకువెళ్లిందని తెలిపారు. ప్రమాదంలో 10 మంది అక్కడికక్కడే మరణించగా.. మరి కొందరు గాయపడ్డారు. క్షతగాత్రులను హుబ్బలిలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## రూ.10 వేల కోట్లతో కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ ..



దావోస్, జనవరి 22:తెలంగాణలో అత్యాధునిక ఎఐ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. అర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ. 10,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతుంది.

ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.

ఈ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు.

ఐటీ సేవల సామర్థ్యం పెరుగుఉందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటు తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణా లు మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్న పురెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం గర్వంగా ఉందన్నారు. సంతోషం వ్యక్తం చేశారు.

## ఊరురా గ్రామసభలు.. వెల్లువలా అర్జీలు..

### -ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల జాబితాలు..
### -అర్హులకే పథకాలను అందిస్తామన్న అధికారులు..




ఆదిలాబాద్, జనవరి 22:జైంట్ మండల కేంద్రంలో రైతు వేదిక ఆవరణలో అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలను ఈనెల 26న అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలకు వెల్లువలా అర్జీలు వచ్చాయి. ఈనెల 26న రైతు భరోసా, భూమిలేని కూలీలకు ఆత్మీయ భరోసా, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు.

అర్హులను గుర్తించేందుకు బుధవారం నుండి పంచాయతీ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి, అర్హుల జాబితా గురించి నోడల్ అధికారులు చదివి వినిపించారు.

ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిర్వహించిన గ్రామసభల్లో ఏ గ్రామంలో ఉండే గ్రామసభ ఆ గ్రామాల వారీగా దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అర్జీలు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ ఇంచార్జి భాస్కర్ నాయక్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఏవో పూజ, ట్రైని ఎస్సై మధుకృష్ణ, మార్కెట్ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఏఈవో రాజు, దేవాదాయశాఖ చైర్మన్ అడ్డి లోకేష్ రెడ్డి, తదితర నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమరావతికి రూ.11 వేల కోట్లు హడ్కో రుణం

అమరావతి, జనవరి 22: ఎపి రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్లు విడుదల చేసేందుకు హడ్కో నిర్ణయం తీసుకుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. ముంబయిలో జరిగిన సమావేశంలో నిధుల విడుదలకు హడ్కో బోర్డు అనుమతి లభించిందని మంత్రి చెప్పారు. వెలగపూడిలో తన ఛాంబర్‌లో నేడు జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలను ఆయన వెల్లడించారు. అమరావతి నిర్మాణం కోసం హడ్కో ద్వారా రూ.11 వేల కోట్ల రుణం కోసం సంప్రదింపులు జరిపామని తెలిపారు. నిధుల విడుదలకు హడ్కో నిర్ణయం తీసుకోవడంతో రాజధాని పనులు వేగవంతం అవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రిలిమ్స్ నోటిఫికేషన్ విడుదల -నేటి నుంచే దరఖాస్తులు స్వీకరణ

న్యూఢిల్లీ, జనవరి 22: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష 2025 తోపాటు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ప్రిలిమ్స్) పరీక్ష నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఇవాళ్టి నుంచే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఇవాళ్టి నుంచి ఫిబ్రవరి 11 వరకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ఈ ఏడాది మే 25న జరగనుంది.

అయితే ఈసారి అన్ని సర్వీసులకు కేవలం 979 ఖాళీలను మాత్రమే యూపీఎస్సీ భర్తీ చేయనుంది. గత ఏడాది భర్తీ చేసిన 1056 పోస్టులతో పోల్చితే ఇప్పుడు 77 పోస్టులు తక్కువగా ఉన్నాయి.

అయితే సివిల్ సర్వీసెస్‌తోపాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో కూడా 150 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు నోటిఫికేషన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్ https://upsc.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

## వారందరినీ సెలవులో ఉంచండి..
### – ట్రంప్ మరో సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 22: రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బందికి లేఆఫ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే ఆ విభాగాల సిబ్బంది అందరినీ సెలవులో ఉంచాలని ఆదేశించారు. ఈ ఆదేశాలతో ట్రంప్ కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసింది.

బుధవారం సాయంత్రం 5 గంటల్లోపు వారందరినీ వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధిత ఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్ పేజీలను కూడా ఈ గడువులోగా పూర్తిగా తొలగించాలని ఉత్తర్వుల్లో ట్రంప్ కార్యవర్గం స్పష్టం చేసింది. అంతేకాకుండా డీఈఐ సంబంధిత శిక్షణ కార్యక్రమాలను కూడా తక్షణమే ముగించాలని ఏజెన్సీలకు సూచించింది. ఈ విభాగాలు చేసుకున్న ఒప్పందాలను కూడా క్యాన్సిల్ చేయాలని ఆదేశించారు. దీంతో ఇప్పటికే కొన్ని వెబ్ సైట్లను అధికారులు తొలగించారు.

కాగా, ట్రంప్ అమెరికా 47వ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. శ్వేతసౌధంలోకి అడుగుపెట్టిన వెంటనే షాకింగ్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. బాధ్యతలు చేపట్టిన గంటల వ్యవధిలోనే గత అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన 78 ఆదేశాలను రద్దు చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేశారు. అంతేకాదు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా ఉపసంహరణ, క్యాపిటల్ హిల్‌పై దాడి కేసులో 1600 మంది మద్దతుదారులకు క్షమాభిక్ష, జన్మతః పౌరసత్వంపై వేటు వంటి వందకు పైగా అంశాలకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు.

## పట్టపగలే దారుణ హత్య..

వరంగల్, జనవరి 22:తెలంగాణ రెండో రాజధాని అయిన వరంగల్ నగరంలోని హన్మకొండలో దారుణమైన సంఘటన చోటు చేసుకుంది. పట్టపగలు అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తిని మరో వ్యక్తి అతి కిరాతకంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

అలాగే దుండగుడి చేతిలో హత్యకు గురైన వ్యక్తిని మడికొండకు చెందిన రాజ్ కుమార్ గా పోలీసులు గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అలాగే ఘనటపై స్థానికులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, ప్రత్యక్ష సాక్షులు, సీసీటీవీ ఫుటేజ్, కొన్ని ఆధారాలతో నిందితుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


అందరూ ఆహ్వానితులే

**యోధ**

మాతృత్వం : భిన్న వ్యక్తీకరణ
కథాసంకలనం
సంపాదకులు : భండారు విజయ



**పరిచయ సభ**

మాతృత్వం భావన చాటున ఎదురైన అనేక మానసిక, శారీరక సంఘర్షణలను, హింసలను, సామాజిక సవాళ్లను ఆత్మ స్థైర్యంతో ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన 'యోధ'ల జీవిత చిత్రీకరణలీ కథలు. మాతృత్వం అనే 'మిత్'లోని డొల్లతనాన్ని విప్పి చెప్పిన కథలివి. యాభై మూడు మంది పాత కొత్త రచయిత్రుల భిన్న వ్యక్తీకరణలీ కథలు.

సమయం :
24 జనవరి 2025 శుక్రవారం సా॥ గం॥ 6.00 లకు

వేదిక :
సీనియర్ సిటిజన్స్ హాలు, కవిరాజుపార్కు, నందులపేట, తెనాలి

నిర్వహణ :
జి.ఎస్. నాగేశ్వరరావు, భిన్నస్వరాలు

వక్తలు :
ఓల్గా ప్రముఖ స్త్రీవాద రచయిత్రి
నందూరి రాజగోపాల్ చినుకు సంపాదకులు
మందరపు హైమవతి ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి

స్పందన :
భండారు విజయ (సంపాదకులు)
ఇందులోని రచయిత్రులు

భిన్న స్వరాలు
సాహితీ సాంస్కృతిక వేదిక, తెనాలి


**చురక**

సత్తువుంటే చీకటైనా
ఛేదిస్తది కిరణం
రాగముంటే ఎక్కడైనా
రాణిస్తది చరణం
కులం ప్రాంత అస్తిత్వం
కట్టుబాట్లు కొంతవరకే
ప్రగతీ ఎల్లల్ను దాటి
ప్రభవించునంత వరకే



-వేల్పుల నారాయణ
9440433475

**నేటి కందం– నేటికి అందం**

చేరాత మనిషి లోగల
తీరును గుణగణ చయమును తెలుపును గానన్
ధీరతతో జరుపవలయు
చేరాత దినంబు ప్రజలు చిన్మయ వృత్తిన్ !!

(జనవరి 23 చేరాత దినోత్సవం)



–రాధశ్రీ
సెల్:9494481210

## ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే తలసాని




హైదరాబాద్, జనవరి 22: ఫుట్ పాత్ వ్యాపారులసమస్యలను పరిష్కరిస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్( అన్నారు. జీహెచ్ఎంసీ నార్త్ జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్ట్రీట్ వెండర్స్‌లో అధికంగా పేదలు ఉన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పధంతో వ్యవహరించాలన్నారు. 23 వ తేదీన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని తెలిపారు. సామాన్యులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## రాష్ట్ర స్థాయి సినారె వాగ్భూషణ పురస్కారానికి అనూరాధ ఎంపిక...



హైదరాబాద్, జనవరి 22:తెలంగాణ కళావేదిక కరీంనగర్ ఆధ్వర్యం లో ప్రతి ఏటా ప్రదానం చేసే రాష్ట్ర స్థాయి సినారె వాగ్భూషణ పురస్కారం 2025 సంవత్సరానికి గాను...హన్మకొండ కు చెందిన కవయిత్రి,వ్యాఖ్యాత మెరుగు అనూరాధ ఎంపికైనట్లు పురస్కార కమిటీ చైర్మన్ దాస్యం సేనాధిపతి, సంస్థ అధ్యక్షులు అనుముల దయాకర్ ఒక ప్రకటన లో తెలిపారు...ఈ నెల చివరి వారం లో కరీంనగర్ లో జరిగే ఓ ప్రత్యేక కార్యక్రమం లో పురస్కారాన్ని అందజేస్తున్నట్లు వివరించారు.


**ఆహ్వానం**

**కవితా సంపుటి ఆవిష్కరణ సభ**

మూసీ సాహిత్య ధార మరియు
తెలంగాణ రచయితల సంఘం, జంటనగరాల శాఖ సంయుక్త నిర్వహణలో



శ్రీమతి ధూళిపాళ అరుణ రచించిన
**చేతనాశిల్పం**



వేదిక
దొడ్డి కొమురయ్య హాల్,
సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగలింగంపల్లి
24 జనవరి, 2025, సా. గం. 6.00 లకు

ముఖ్య అతిథి, పుస్తకావిష్కర్త
డా. వెలుదండ నిత్యానందరావు
వైస్ ఛాన్సలర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

సభాధ్యక్షులు
దాస్యం సేనాధిపతి
ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

విశిష్ట అతిథి
డా. ఏనుగు నరసింహారెడ్డి
ప్రముఖ కవి, రచయిత, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

ఆత్మీయ అతిథులు

డా. ఎస్. రఘు
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

డా. రూప్ కుమార్ డబ్బీకార్
ప్రముఖ కవి, రచయిత, అనువాదకులు

డా.నెల్లుట్ల రమాదేవి
ప్రముఖ కవయిత్రి, రచయిత్రి

డా. కొండపల్లి నీహారిణి
ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, సంపాదకురాలు

కందుకూరి శ్రీరాములు
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
జంటనగరాల శాఖ

డా. బెల్లంకొండ సంపత్ కుమార్
ప్రధాన కార్యదర్శి , తెలంగాణ రచయితల సంఘం
జంటనగరాల శాఖ

వందన సమర్పణ
గడ్డం సులోచన
కవయిత్రి

'మయూఖ' అంతర్జాల పత్రిక అభినందనలతో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1367వ రోజు 'సంగీతం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'సంగీతం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839

## ఎల్లలు

ఎల్లలులేని కల్లలాడని గీతం
సంగీతం నాదతనుమనిశం
శంకరంతో
ఓంకారంతో అంతరిక్షం
సప్తస్వరాల్లో పశుపక్షుల నాదాలు
ఆరోహణ అవరోహణలతో
డెబ్బై రెండు మేళకర్తలలో
వేవేల రాగాలు
ఆరభి తో కచేరీ ఆరంభం
సురభితో అంతంతో
కర్ణాటక సంగీతం
దేశదేశాల్లో వ్యాప్తం.
పురందరదాసు పిల్లారిగీతాలు
కన్నడంలో సంగీతానికి సోపానాలు
నాడుల్లో చురుకుదనం
రోగనివారణలో ప్రాధాన్యం
మ్యూజిక్ థెరపీతో
గణపతిసచ్చిదానందస్వామి
బాలమురళీల ప్రయోగాలు.
సంగీత త్రిమూర్తులు
సంస్కృత తెలుగుకీర్తనలతో
అజరామరులు
తిరువయ్యూర్ లో
త్యాగరాజారాధనోత్సవాలతో
కావేరీ పులకించు
ఎందరో మహానుభావులేతెంచు.
కులమతజాతివర్ణ
వర్గ భేదాలెరుగని
సంగీతం విశ్వజనీనం
హిందూస్థానీ సంగీతంతో టుమ్రీలు
మీరా సూరదాస్ కబీర్ భజన్స్ తో
బడేగులాం మొదలు
పర్వీన్ సుల్తానా తో
పులకించిన ప్రపంచం బీథోవెన్
జాజ్ సంగీతం
పాశ్చాత్య పోకడలతో
నేటి మన సినీ సంగీతం
జాన్ హిగ్గిన్స్ గాత్రంలో
కీర్తనలు రాగాలు
తెలుగుభాషలో తేనె పలుకులు.
ఈలపాటలు
మృదంగతరంగాలు
వీణానిక్వణాలు
జావళీలు,తిల్లానాలు
నాట్యానికే
మువ్వలు
యు.ఎస్.ఓ.లో
ఎం.ఎస్.పాడిన
కంచిపరమాచార్య ప్రార్థన
నభూతో నభవిష్యతి.
తెలుగు ఆస్థానాలు
కవులు
సంగీత విద్వాంసుల నిలయాలు
హరికథకైనా
బుర్ర కథకైనా రాగాలే
ప్రాణాధారాలు సజీవ స్వరాలు.
నేటి సినీసంగీతం
వాద్యాలహోరులో
పదాలు అర్థంకాని పోరులో
రణగొణధ్వనులతో
తెలుగుదనం మటుమాయం
లాలిజోలపాటలు
మంగళహారతులకు
మంగళంపాడిన మనం
స్మార్ట్‌ఫోన్ ఛాటింగ్ లో
మునకలు
రోజంతా గజిబిజితో
తునాతునకలు!?.

-ఎ.రాజ్యశ్రీ

## సంగీత సుధాంబుధి

"సంగీతమపి సాహిత్యం
సరస్వత్యాస్తన ద్వయమ్
ఏకమాపాత మధురం
అన్యదా ఆలోచనామృతమ్"
భాష అర్థం కాకపోయినా
శ్రుతి శుభగమై
ఆనందాన్ని ఇచ్చేది సంగీతం.
దిగి లోతుపాతులు చూస్తేనే
ఆనందం వచ్చేది సాహిత్యం.
వేకువన పక్షులకిలకిల రావాలలో
వినిపించే సంగీతం
హృదయాహ్లాదకరం.
సంగీతానికి సామవేదం జన్మస్థానం
ఆనాటి మంత్రాలు
మూడు ప్రధాన స్వరాలలో
గానం చేయటంతో
సంగీతం ప్రారంభం.
తర్వాత సప్త స్వరాల అవతరణ
సప్త స్వరాలకు పశుపక్ష్యాధులు
అధిపతులు కావడం వాటి అదృష్టం
భారతీయ సంగీతం రెండు పాయలై
వివిధ వాద్యాల సమ్మేళనంతో
శృతి లయ రాగ తాళాదుల
స్నేహబంధంతో
కర్ణాటకగానామృతం
"రహి బుట్ట రాల్కరగించు
విమల గాధర్వంబు/విద్య మాకు"
అని పెద్దన్న చెప్పే స్థితికి ఎదుగుదల
పరాయి బాషల ప్రభావం
హిందుస్తానీ ఆవిర్భావం.
ప్రాంతీయ సంగీతాలు,
కొండ జాతి సంగీతాలు
కుండ మొదలు
బండ దాకా వాయిద్యాలు
భక్తి సంగీతం ప్రేమ సంగీతం
విషాద గీతాలు,సందేశాత్మక గీతాలు
సినీమా సంగీతాలు
ఏ భావాన్నైనా ఇముడ్చుకొని
మాధుర్యాన్ని అందించే సాధనం సంగీతం.
ప్రపంచీకరణ పుణ్యమా అని
సంగీతం సహస్ర ముఖాలుగా
కోటి రాగాలతో
కోట్లాదిమంది జనుల హృదయాలను
ప్రపంచవ్యాప్తంగా దోచుకుంటోంది.
ప్రతి దేశానికి ఒక సంగీత శైలి,
ప్రతి హృదయాన్నికదిలించే సంగీతాన్ని
చెప్తే ఒక భారతమే.

-డా.సి.వసుంధర

## నాదామృతం

మంచు ముత్యమై
జాలువారే రాగాలు
శతకోటి రాగాల సుస్వర గీతాలు
చిరుగాలులలో నర్తించే సుమధురాలు
ఊరి జనాల నోట్లోనానే
జానపద గీతాలు.
నిశీధిరాగాల రహస్య గమనం
మనోసాగరంలో అలల సంచలనం
మనిషి భావాలకి ఇచ్చే సాంత్వనం
శృతి లయ రాగం తాళ సమ్మేళనం
అనేక భావాలను
తీయగా పలికే సాధనం.
స్వరాల సోయగంలో
హృదయం పొందే అనుభూతి
స్నేహంలో ప్రవహించే
దివ్యమైన గీతి.
ప్రాంతానికో రూపం సంగీతం
ప్రతి రాష్ట్రానికో గీతం.
సాహిత్యానికి ప్రాణం పోసే తరుణం
మధుర సంగీతమే
రమ్యమైన జీవన ప్రయాణం.

-డా.రమ్యాస్వరూప్

## జగమంతా రాగమయం

స్వరాలు ఏడైనా
డెబ్బై రెండు మేళకర్త జన్యురాగాలు
వాటినుంచి జనించిన
అనేకానేక రాగాలు
భావ,రాగ,తాళ,
లయ గతుల సమ్మిళితం.
డో-రే-ఫా-సా- అని పలికినా
సరిగమపదని స్వరములైనా
కూనిరాగాలు తీసినా
కోయిలమ్మ కూతైనా
ఉల్లాసభరితమే!.
శిశువులనైనా
పశువులనైనా
పాములనైనా,పక్షులనైనా
రసవాహినిలో ఓలలాడించేది!.
సంగీతం
మనోరంజకం
ఎల్లలెరుగనిది
లిపిలేని తరంగభాష
ప్రపంచ ప్రజలను ఏకం చేస్తుంది
శ్వాసను క్రమబద్ధం చేస్తుంది!.
మానసికోల్లాసానికి సంగీతం
మనసుకు సాంత్వన సంగీతం!
మనోవ్యాధికి ఉపశమనం
మానని వ్యాధికి చికిత్స!.
పసిపాపకు పాడే జోల సంగీతం
పనిపాటలలో ఉత్సాహ కారకం
జనచైతన్య సాధనం
చిరుగాలి తరగలలో
సెలయేటి గలగలలో
పిల్లగాలి పరుగులలో
చిలుకల కిలకిలలో
కోయిలమ్మ పాటలో
ప్రకృతి అంతా నిండి
ఉన్నది సంగీతం!.
ఆస్వాదించే మనసుంటే
జగమంతా దాగున్నది
మధుర నాద సంగీత మకరందం!!.

-చంద్రకళ దీకొండ

## సుర రసామృతం

శిశుర్వేత్తి పశుర్వేత్తి
వేత్తి గాన రసం ఫణిః !
శిశువులు, పశువులు
సర్ప విహంగాలు.
సర్వ జీవరాసులు ఆనందించే
స్వరామృతం సంగీతం
సప్తస్వరనుత సంగీతామృతం
గమక తాళ శృతి లయల.
స్వీకార సంయుతం సంగీతం
సరస్వతి వీణా నాదామృతం
వీనులకు ఆనందం
రాళ్లను కరగజేస్తుంది రస రమ్యంగా
భావాలు గుప్పించే మధుర స్వరూపాలు
భక్తి నింపే ప్రత్యేక భావన
భగవంతుని నిజ సన్నిధిని చేర్చే భక్తి
తమకంతో అనుభవైక యోగం
స్వర్గధామం.
అపరంజి గానామృతం
హృదయ లయ విన్యాసాల నాట్యం
స్వరహేల రస భావనా రూపం
మధురం, దివ్యం, అపురూపం
మనోరంజితం
మహిమాన్వితం.
సన్మంగళాని భవంతు సర్వులకు
సంగీత జలధి మోక్షప్రదాయకం
అగణిత, ద్విగుణీకృత
సంగీత హేల
చేరుస్తుంది స్వర్గధామం.

-కె.కె.తాయారు

## రాగమయం

కళామతల్లి ముద్దుబిడ్డలు
సంగీతసాహిత్యాలు
సాహిత్యం సమాజ హితం కోరితే
సంగీతం మానసికోల్లాసం
మనోరంజకం
కళల్లో మేటి
దేశ ప్రాంత భేదాలు లేనిది
అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసే నేర్పు
సంగీతం సొంతం
ప్రకృతి అంతా సంగీతమయమే
పక్షుల కిలకిలా రావాలు
సెలఏటి గలగలల్లో
పాటకి పల్లవి
పల్లవికి రాగం
రాగానికి సంగీతం కావాలి
సంగీతం అంతా సరిగమల్లోనే
మనసుని రంజింప చేసి
బాధల్ని మరిపించి
మురిమింప చేసే సంగీతం
సరాగాల సంగీతం
తాళం వెయ్యలేకున్నా
తన్మయత్వంలో
ఓలలాడించే రాగాలు
దేశ ప్రాంత కుల మత
వర్ణ బేధాలు లేనిది
సకల ప్రాణి కోటిని
కదిలించే సంగీతంతో
మానసిక రుగ్మతకి మందు.

-మోటూరి శాంతకుమారి

## అమృతం

సంగీతమో జీవాత్మ
ఒక పరమాత్మ
గీతం దేవుని చేరే దివ్య మార్గం
సంగీతం ఆత్మానంద భవ్య మార్గం.
లలిత సంగీతం
మీటుతుంది హృదయ తీగలను
భక్తి సంగీతం భగవానునికి
హృదయ నివేదన.
ప్రేమను తెలిపే
రంజైన అనురాగం సంగీతం
కలువ వికసిస్తూ
నృత్యంచేసే చంద్రుని
ముసిముసి నవ్వుల సంగీతం.
ఝందామెరల వికాసం
సూర్యుని చక్కని సంగీతం
పక్షుల సంగీతంతో
తెల్లారే మోగే పెట్టని అలారం.
ప్రియుని మనసు పాడే పాట
ప్రియురాలి మది
మురిపించి మరిపిస్తుంది
తల్లిపాడే లాలి పాటతో
నిద్రలో కలల విహారం
మది బాధలో
సంగీతమే ఔషధం
సంగీతం
మానవజీవామృతం!.

-ప్రశాంతి రేవూరి

## ప్రకృతి అంతటా నిండిన రసమయగీతం

ప్రకృతి అంతా రసమయగీతం
సంగీత ఝరి అలాపన
ఆస్వాదించే హృదయముండాలేగాని
ప్రకృతిపాడే ఆనందభైరవి రాగం
చెట్లు, జలపాతాలు
నదీ, ప్రవాహాలు
పిల్లకాలవలు
కొండచరియలు,కడలికెరటాలు
పైరు పచ్చనికోకతో అలరించే
పంట గాలులు
పక్షుల కిలాకిలారావాలు
అవనిపై పడే
ముత్యపు చినుకుల సవ్వడి
పాపకోసంపాడే జోలపాట
పండిత పామరులను
పశుపక్ష్యాదులను
పాములను సహితం
రస వాహినిలో ఓలలాడించేది
సంగీతం
పల్లెపదములు
పొలాల్లో పనిచేస్తూ
కష్టం మరచి పాడే పల్లె పదాలు
అర్థత సమయసందర్భాలవసరంలేని
విన్యాసం సంగీతం
రోగనివారణ మ్యూజిక్ థెరపీ
బాలమురళి ప్రయాగాలు
త్యాగరాజు, పురందరదాసు కీర్తనలు
సూరదాసు కబీరు
మీరా భజనలు
హిందూస్తానీ సంగీతం
సుస్వర కోకిలల నుండి జాలువారి
వుద్రుత లాగించే స్వర ఝరులు
హృదయాలను కదిలించే
రసమయస్వరాలు.

-ఆర్. రమాదేవి

## కాదేదీ సంగీతానికి అనర్హం

దలో స్పందించిన భావాలు
గళంలో ఎగసిన స్వరాలు
పెదవుల్లో పలికే రాగాలు
రాగాలకు తాళం నాదం
తోడు నీడై గీతాలు
సంగీతాలు
తరంగ విహంగాల
మనోహర వ్యంజనాలు.
జలపాతాలు
నదీ ప్రవాహాలు
కొండ లోయలు
సాగర కెరటాలు
పచ్చని పైరుల వీచే పిల్లగాలులు
వృక్షవాకిళ్లలో
పోటీపడే పవన పాటులు
ఇంకెన్నింటో గుప్తమైన సంగీతం
ఆహ్లాదించే చిత్తం ఉండాలే కాని
సంగీతం
అన్నింటా మనకోసం.
అర్థతలేం అక్కరలేదు
లేత ప్రాయాల పసిపాపలు
జోలపాటల మురిసి సేదతీరు
కాయ కష్టం చేసే కర్షక కార్మికులు
వారిదైన పాటల పాడుకుంటూ
అలుపు సొలుపుల మరిచిఉండు
బాత్రూమ్ సింగర్లు
చన్నీళ్ల స్నానాల అద్భుత గానాలు
కాదేదీ సంగీతానికి అనర్హం.
దగ్గరకెళ్ళే కొద్దీ కౌగిళ్లు
భక్తి, వైరాగ్య,శృంగార, హాస్యరసాల
సంగీతరసాల ఆనందమే ఆనందం
రోగాలకు ఔషధం
భోగాలకు మత్తు పానీయం,
ఆత్మను చుంబించే సాధనం
సాధకుడవ్వటం ఉత్తమం
అభిరుచుల ఆనందించడం మధ్యమం
విస్మరించి త్యజించడం నికృష్టం.

-రాజప్ప


## సుస్వర నాదం!


తీగలు మీటిన స్వర సుర నాదం
సుధలను చిందించే
రాగాలను పలికిస్తూ
హృది పొంగిన భావం
పరవశ మాధుర్యంతో
ఉప్పొంగే తన్మయరాగం.
శతకోటి రాగాల
సప్తస్వర నాదం సంగీతం
హృది వీణను మీటిన
వాణీరాణి కి స్వరాభిషేకం
శృతిలయల సమ్మేళనమై
జీవన గమనంలో భాగమై
పల్లవించిన హృదయ పరాగం.
శిశుర్వేత్తి పశుర్వేత్తి
వేత్తి గాన రసం
నాదం మోదం
అనాది జీవన వేదం.
స్వరములు తీయగ పలికే
పెదవుల మధువులు చిందించే
సుధామృతం.
ఎదలోయల్లో
జతులై గతులై
సెలయేరుల ఝరులై
ప్రవహించిన స్వర స్నేహ గీతం
ప్రభాత సంధ్యారాగంలో
చిరుగాలుల సవ్వడిలో
కొండల కోనల లోయల్లో
పులకించిన ప్రకృతి నాదం.
కొమ్మల ఊయలలో
తుమ్మెద ఝుంకారంలో
పూరెమ్మల విరుపుల్లో
వికసిత సౌగంధం.
రాగం తాళం శృతి పల్లవియై
అణువణువునా
ప్రభవించిన స్వర రాగం
రాసక్రీడల రసమయ లీలల
కేళీ విలాస అభినయ ప్రేమామృతం.
విరించి విపంచియై
ప్రభవించిన విశ్వరూప విన్యాసం
ఓంకారం ప్రణవనాదం.
నవరస నటనల విన్యాసం
విశ్వరూప దర్శనం
సిరి మువ్వల జల్లుల వెన్నెలలా.
మది చల్లగా
సరస స్వర సుర గంగా ప్రవాహం
శ్రమజీవుల అలసటనే
మరిపించే స్వేచ్ఛా తరంగం
పునరుజ్జీవన గేయం
జనజీవన గీతం జనపదం.

- పి.పద్మావతి

పుస్తక సమీక్ష

# అనుభవ సార ప్రతిఫలనాలు ఈ కథలు!



**ప్రతులకు:** డా॥కె.మీరాబాయి
ఎంఐజి-20, ఎ.పి.హెచ్.బి.
కాలనీ, బి-క్యాంపు,
కర్నూలు-518 002
సెల్: 94908 83299

నవల ఒక జీవితం అయితే ఆ జీవితాల్లోని మెరుపుల్నీ, మరకలనీ విశదీకరించి చెప్పేవి కథలు (స్వర్గీయ వేదగిరి రాంబాబు గారి ప్రకారం కథలు వేరు. కథానికలు వేరు. నేను మాత్రం స్థూలమైన అర్థం తీసుకుని రెంటినీ కథలుగానే పేర్కొంటున్నాను).

సాహిత్య పరిణామ క్రమాన్ని పరిశీలించితే, రాను రాను, నవలలకు ప్రాచుర్యం తగ్గి కథలే విశేషంగా ఆదరించబడుతున్నాయి. కారణం.. యాంత్రికం అవుతున్న జీవితాల్లో పాఠకులకు నవలలు చదివేంతటి సమయం, ఓపికా, ఉండటం లేదు. వారాలకు వారాలు కొనసా...గే.. సీరియల్ నవలలకు ప్రాచుర్యం పూర్తిగా తగ్గిందనే చెప్పుకోవాలి.

జీవన వ్యాపారంలో 'ఆర్జన' అన్నది ప్రధమ స్థానమైంది. లలిత కళలు తమ లాలిత్యాన్ని కోల్పోతున్నాయి. మానవ సంబంధాలకు, పరస్పర ప్రేమ ప్రకటనలకు సమయం ఉండటం లేదు. 'ఆ రోజు ఆ పూట, ఆ ఘంట-గడిస్తే చాలు' అన్న దృక్పథం మనుషుల్లో పేరుకు పోతూన్నది. గడియారంతో పోటీ పడుతూ, పరిగెడుతోన్న నేటి కాలంలో ఇంకా సాహిత్యానికి ఆదరణ లభించటానికి కారణం సాహిత్యం సమాజానికి చేస్తోన్న మేలు అనే చెప్పాలి.

సాహిత్యం, స్వాంతనను ఇస్తుంది. మనల్ని మంచి దారిలో నడిపించేందుకు 'దారిదీపం' అవుతుంది. మంచి కాలక్షేపం అవుతుంది. అందువల్లే, పాఠకుడు సాహిత్యాన్ని సమాదరించుతున్నాడు. రచయితలు మంచి సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. నిజం చెప్పాలంటే - నిరుటితరం కంటే ఎక్కువగా నేటి తరానికే మంచి సాహిత్యం ఉద్భవిస్తున్నది. కంప్యూటరు డి.టి.పి. లాంటి సౌకర్యాలు రచయితకు పఠితకు మరింత దగ్గర చేస్తున్నవి. నాటికంటే మరింత ఎక్కువగా సాహిత్యం సృజించబడుతోన్నది.

డా॥కె. మీరాబాయిగారు నాలుగు తరాల తెలుగు జీవనాన్ని అతి దగ్గరగా మరియు గ్లోబుకు అటేపు నుండి కూడా పరిశీలించిన రచయిత్రి. అనుభవల్లోంచి కథలు సృష్టిస్తారు. కనుక వీరు కథల్లో వాస్తవికత ఉట్టిపడుతుంది. బంగారానికి పరిమలం అద్దినట్లు, వాస్తవికతకు సారళ్యతను జోడిస్తారు. చాలా మంది పాఠకులు వీరి కథల్లో తమను తాము చూసుకోగలుగుతారు. దీనివల్ల రచయిత్రి పాఠకులకు మరింత దగ్గర అవుతారు.

> సాహిత్య పరిణామ క్రమాన్ని పరిశీలించితే, రాను రాను, నవలలకు ప్రాచుర్యం తగ్గి కథలే విశేషంగా ఆదరించబడుతున్నాయి. కారణం.. యాంత్రికం అవుతున్న జీవితాల్లో పాఠకులకు నవలలు చదివేంతటి సమయం, ఓపికా, ఉండటం లేదు.

వీరి రచనల్లోని కథ, కథనం, సంఘటనల పేర్పు- ఎక్కడా కృత్రిమత కనిపించదు. మార్మిక నైజం (Magic Reality) కనిపించదు. మార్మిక నైజం పాఠకుడిని ఊహాలోకపు ఉటోపియా (Utopia) తీసుకువెళ్ళి అదో రకపు 'ట్రాన్స్'లో ముంచెత్తుతాయి. కాని, ఏదో ఓ సమయాన, లేదా కథ పూర్తి అవగానే పాఠకుడు యదార్థ జగతుకు దిగి రావల్సిందే! రమ్య హర్మ్యాలు, హంస తూలికాతల్పాలు, పరిచారికలు, మృష్టాన్న భోజనాల కలల్లోంచి, పూరిగుడిసె, కుక్కి మంచం నిరుద్యోగ దిగులు లోకి దిగి రావాల్సిందే!

డా॥ మీరాబాయిగారు దాదాపు ప్రపంచంలోని ప్రముఖదేశాలు తిరిగారు. లోగడ "డా॥ తంగిరాల మీరాసులు) మణ్యం" అన్న పేరుతో 6 కథా సంకలనాలు అందించారు. ఇది వీరి ఏడవ కతా సంకలనం. "మాలిక" అన్న అంతర్జాల పత్రికలో కరోనా కష్టకాలంలో వరుసగా మూడేళ్ళు కథలు వ్రాసారు. ప్రస్తుత కథా సంకలనం "వేకువలో.. చీకటిలో.." మాలిక, విహంగ గో తెలుగు, కెనడా తెలుగు తల్లి, నెచ్చెలి, వీక్షణం, దయాస్పోరా కథలు మొదలైన పత్రికలకు కథలు అందించారు. వీటిలో ప్రచురించబడిన 37 కథలు కదంబ మాల ఇది.

80 ఏళ్ళు పూర్తి చేసుకున్న ఈ వరిష్ట రచయిత్రి 18 ఏళ్ళ పడుచు ఉత్సాహంతో ఈ కంప్యూటర్ యుగంలో, మారుతోన్న కాలంతో సమంగా పరుగెడుతూ, అందించిన ఈ మాలిక ఎందరో వర్ధమాన యువ రచయితలకు ఆదర్శం. వయసు పైబడటం అన్నది శరీరానికే గాని, మేధకు కాదు అని నిరూపిస్తాయా కథలు.

వీరి కథల్లోకి వెళితే-

ప్రసిద్ధ కథా రచయిత, సాహితీవేత్త శ్రీ సుధామగారు "మధ్య తరగతి జీవన నేపథ్యం నుండి మానవీయ విలువల మూల కందమైన ఇతి వృత్తాలతో మంచి కథలు రాస్తూ.. ఇప్పటికీ, తమ రచనా నైపుణిని నిలబెట్టుకుంటూ, నేటి కాలానికి ప్రయోజనదాయకమైన స్ఫూర్తివంతమైన కథా సంపద నందిస్తున్నారు" అంటారు.

ఇది ప్రత్యక్షర సత్యం. మానవ సంబంధాల పటిష్టత, ఆవశ్యకత హైలెట్ చేసి రాసిన కథలివి. సమస్యను పలు కోణాల్లోంచి పరిశీలించి రాయటం ఈ రచయిత్రి ప్రత్యేకత. ఆ ప్రత్యేకతే రచయిత్రిని సమూహంలోంచి వేరుగా నిలబెడుతుంది.

అదెలాగో తెలుసుకుందాం.

వృద్ధాప్యం అందరికీ వస్తుంది. ఇదో తప్పించుకోలేని పరిణామం. 'వాన ప్రస్థం' అంటే నాటి కాలంలా వనాలకు పోయి కందమూలాలు తింటూ నేడు కాలం గడపటం సాధ్యం కాదు. లోకం మీద ఎందరో అనాధలు, నిరాశ్రయులున్నారు. ఆ నలుగురి కోసం కొంత ప్రేమను పంచటం కూడా వాన ప్రస్థ జీవనమే అన్న క్రొత్త నిర్వచనం ఇచ్చిన 'నలుగురి కోసం' కథలోని దాసు ప్రశంసార్హుడు.

గతమెంతో ఘనంగా గడిచిపోయింది సత్యానికి. ఇంట్లో అన్నీ, ఆయన అన్నట్లే జరగాలి. పోనీ- ఆయన ఆలోచనలు అర్థవంతంగా ఉంటాయా? అదీ లేదు. తనకు లోకువైన భార్యశాంతకు ప్రతి దానికీ సాధిస్తుంటాడు కాని లోపల భార్యపై ఎంతో ప్రేమ ఆరాధన. ఆ ఆరాధన బయటకు చెప్పుకున్నా, భార్య శాంత గుర్తిస్తుంది వేకువలో.. చీకటిలో.. అన్న టైటిల్ కథలో. పరస్పరావగాహన ఉన్న వారి కుటుంబం కష్టాలకూ, సుఖాలకూ ఒకరికి ఒకరం ఉన్నాము అన్న భావన వారి కుటుంబంలో ఆనందపు సిరి(విరి) జల్లులు వరిచిందని వేరేగా చెప్పనక్కరలేదు.


'మనుషుల మధ్య బంధాలన్నీ ఆర్థికావసరాలే అన్నాడో ఆర్థిక తత్త్వవేత్త. ఈ నగ్నసత్యాన్ని నిజం అని నిరూపించటానికే పుట్టాడా జయంత్. పెళ్ళయ్యాక రెండు వేపుల తలిదండ్రుల్ని అవసరాలకు వాడుకుని వదిలేయాలి అన్నది అతని స్వభావం. పెళ్ళి చూపులకు ముందు వారిజకు కలిసిన జయంత్ ఆమెకు నచ్చకపోవటంలో ఏ మాత్రమూ వింత లేదు, హృదయ బాంధవ్యం అన్న కథలో జీవితలో భర్త పిల్లలు ఎంత ముఖ్యమో తలిదండ్రులు చెల్లి కూడా అంతే ముఖ్యం అని చెప్పించి వారిజను అత్యున్నతంగా చిత్రించారు రచయిత్రి.

వీరి కథా ప్రపంచంలో భార్య సంపాదన కావాలి. కాని భార్య బాగోగులు అక్కరలేని పరమేశాలు, మంచి మనసు ఉన్న అత్తలు కనబడతారు (అత్తమ్మ కథ) తనని కన్న అమ్మ కడుపుకు ఇంత అన్నం పెట్టక వేధించిన కొడుకుకు తన కాలేయం దానం చేసే మంచి మనసు 'ఖాజా బీబీ'లు ఉంటారు.

ఈ దేశమే కాదు. కాలిఫోర్నియా లాంటి విదేశాల విశేషాలు తెలుసు రచయిత్రికి. ఆ దేశపండగ వైభవాలు క్రొత్తగా మనవరాలు చదవటానికి వెళ్తొంటే నానమ్మ పడే దిగులూ తెలుసు (అమ్మాయి వెడలెను).

కథలకు ఇచ్చే టైటిల్స్ కూడా చూడగానే ఆకట్టుకోవాలని , ఆసక్తి కలిగించే ఎత్తుగడే కథకు ముఖ్య భాగమని తెలుసు. మారిపోయేలా కాలం, కూరిమి కలవారంతా కొడుకు లేనురా, రేపటికి మిగిలేది కరోనా కాలంలో కళ్యాణ వైభోగం లాంటి శీర్షికలు 'అభయ కాంప్లెక్సులోని 'సి' బ్లాక్ 320 ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. నలభై ఏళ్ళ రవీంద్ర ముక్కు నోరు కప్పుకున్న మాస్కు, చేతులకు తొడుగులు వేసుకుని బయట అడుగుపెట్టాడు' (చెలమ కథ) లాంటి ఎత్తుగడతో పాఠకులలో ఆసక్తి రేపుతారు మీరాగారు.

వీరి కథలు చదువుతోంటే, జీవితాల్ని చదువుతోన్నట్లు ఉంటుంది. ఈ ఒక్క టెక్నిక్ వీరిని కథా ప్రపంచంలో ఎవరెస్టు శిఖరాన నిలిపింది. రచయిత్రి అభినందనలు.



- కూర చిదంబరం
సెల్: 8639338675





**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం-కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

-సంపాదకులు

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు, -బెల్లంకొండ సంపత్ కుమార్

## నిద్ర ఏల రావు !!

నిద్రా! ఇదిగో నిన్ను పట్టుకునేలా పట్టు పరుపు!
తల కిందకు రాజసంగా ఒత్తిడి లేని మెత్తని దిండు!
గదిలో హిమాలయపు చల్లని ఏసి గాలి!
కడుపు నిండా నల భీమ పాక మృష్టాన్న ఆయస భోజనం!
అయిన అలుగుడు నిద్రా రావేమి?
రెప్ప మగత మగతగా వాలదేమి!!
నిద్ర ఏల రావు
నిద్రకు ఇవన్నీ కావాలా!!
పని చేసి అలసి పోయి నేల వాలితే చాలు!
నిద్ర వద్దన్నా వస్తుంది!
పొమన్నా పోదు!

-కందాళై రాఘవాచార్య
8790593638

## వెనుకంజ

అల్లెతాడు వెనక్కి లాగితేనే బాణం దూసుకెళ్లేది
బంతి బలంగా నేలకు విసిరితేనే పైకె గిరేది.
వెనుకంజ వ్యధాభరితమేం కాదు
వినియోగించుకునే విధమెరిగితే
అది చక్కని సిద్ధాంత వ్యాసం.
బంధ విముక్తమైతేనే బొంగరం గిరగిరా తిరిగేది
ఉలి దెబ్బల కోర్చితేనే నల్ల రాతిలో నవరసాలొలికేది
వెనుకంజ తలవంపు ఎంతమాత్రం కాదు
నీ అంతర్గత శక్తులను తట్టి లేపే చైతన్యదీప్తి
సౌర పటానికి వాన చినుకు వ్యతిరేకమైనప్పుడే సింగిడి సాకారమయ్యేది
ఆకులన్నీ రాలితేనే మోడు కొత్త చిగురు తొడిగేది
వెనుకంజ అవమానభారమెన్నటికీ కాదు
ఒడిసి పడితే నీ ఆశయ సాధనకు బిగిసిన ఉక్కు పిడికిలి
వెనుకంజ బాధాతప్తమసలే కాదు
మలుచుకునే తీరు తెలిస్తే అది జీవన సుధారససారం

- పద్మశ్రీ చెన్నోజ్వల

## కుక్కినపొట్ట

నిద్ర ఏల రావు ?
పొట్ట పెట్టెలో కుక్కికుక్కి పెట్టగ
అరగక ఒరిగితే
పట్టెమంచం పరుపు కాస్త
ముళ్ళకంచెగ మారె !
తలదిండు కాస్త
అగ్ని గుండమయ్యె !.
రమ్మంటే రావడానికి
పొమ్మంటే పోవడానికి
అదేమన్న
పెట్టుకున్న నౌకరా
కట్టుకున్న భార్యనా
అది పొట్ట.
అలిగింది
అంతే !
కాళ్ళు కదలవు !
చేతులు ఆడవు !.
పొట్టలో గుడగుడ
గుండెలో దడదడ
ఇంకా
నిద్రెక్కడి నిద్ర
ఆచ్ పిట్ట ఎగిరిపోయింది
పొట్ట పగిలి పోయెటట్టుంది
నిద్రా
నీకు చేతులెత్తి మొక్కుతున్నా
మళ్ళెప్పుడు పొట్టనిండా మెక్కనన్నా
అని అన్నా వినలే
ఎంతకూ నిద్ర రాలే
దాన్ని తగలెయ్య
నాకు
నిద్ర పట్టకుండా చేసింది!!

-కందుకూరిశ్రీరాములు
9440119245

## అనగలరా ఎవరైనా..!

సమస్యలు సంగమించిన వేళ
దుఃఖపుటేరులు ప్రవిస్తూ
సముద్రాలై ఎగుస్తుంటే..
అనగలరా ఎవరైనా కాలం అబద్ధమని..!!.
ఆకలి చిచ్చు కాలుస్తున్న పేగులు
తడి ఎండిన గొంతులతో
కంటినుండి సెగలను చిమ్ముతుంటే..
చెప్పగలరా అంతా ఉత్తిదే అని..!!.
కలిసి వుండే మనసులు కళలు తప్పి
దూరాలకు తలుపులు తెరిచి
నిర్జీవ పాత్రలుగా నడయాడుతుంటే..
సాహసం చేయగలరా సర్దుకోమని..!!.
అలుముకున్న మోహావేశాలు
అధర్మాలకు నెలవులు కాగా
జీవితాలను ఛిద్రం చేస్తుంటే
శిక్ష లేదంటారా ఘోర నేరాలకు..!!
ఆస్తుల కోసం చేతులు చాపి
కన్నవారి గుండెలు అవిసిపోగా
ఆశ్రమాల బరువును పెంచుతుంటే
వదిలేయమంటారా ఇంకా జాలిపడి..!!.
విడివడిన మనుషుల బంధాలు
వర్గాలకు విలువలు పెంచి
రక్త దాహాన్ని తీరుస్తుంటే
ఆపగలరా అవినీతి దారుల ఆగడాల్ని..!!.
ఆగని జీవన చక్రంలో జరిగే నిజాలకు
మిగిలిన నీ కాలపు విలువ ఎంతో...?
తెలుసుకునే తెగువ ఉంటే
మారి చూపించు మనిషిగా..
మనసు శిల కరుగుతున్న కరుణగా....!

-అరుణ ధూళిపాళ

## కర్మయోగి!

పనినే పనిగా చూట్టం తెలిసినవాడు
పనినే దైవమని నమ్మినవాడు
చెరగని చిరు దరహాసంతో
ఛెంగుఛెంగున పరుగెత్తుతాడు పని కోసం
పురమాయించిన పనిని పూర్తిచేయందే
విశ్రమించని కర్మయోగి
అందరికీ తలలో నాలుక
వాద వివాదాలు తెలియని
ఏనాడు శృతిమించని అమాయకజీవి
ఎలకోయిలల తీయని పాఠాలు
నిత్య వసంత శోభలు చుట్టూ
అమాయకపు అల్లర్ల చిలిపిదనాల
వసివాడని పసిలోకం పిలుస్తున్నట్టు
మనసుదోచే హరితమయ
అందాల కన్నులు విరబూసి
రమ్మంటుంది అతని అన్నుల ప్రాంగణం
నిత్యబోధకులు ,సత్య సాధకులు
ఎందరోత్యాగమూర్తులు ,
మరెందరోఅనురాగమూర్తులు
వాళ్ళు నడయాడిన చరితెంతో ఘనం
మహావ్యక్తిత్వాల్ని,మూర్ఖ మనస్తత్వాల్ని
అక్షరం ముక్క రాకున్నా
ఆకలింపు చేసుకున్నాడు
ఏన్నో సమావేశాలు,
ఏవో ఉవ్వెత్తున ఎగసిన ఆవేశాలు
అతను ఆసాంతం ఎన్నని ఆలకించలేదు?
స్వా'గతాల' సందడిక్షణాలను,
వీడ్కోళ్ళ అశ్రుకణాలను
ఆప్తుల బదిలీలు, పదవీ విరమణలు
రాయబడిన ఆనందాలు, గాయపడిన క్షణాలు
అతని జీవితానుభవంలో
ఇంకా ఎన్నని చూల్లేదు ?
ఆది నుండి అతనే వీటన్నింటికి సజీవ సాక్ష్యం
కోటి ఊసులు శంఖమూదగల హృదయం
అతను
కోటి వేదనలు మృదంగమై
మ్రోగగల హృదయం అతను
మూలవేతనం డి.ఏల నిరసన,
అలకల్లేని , పీఆర్సీల గొడవల్లేని
గౌరవ వేతనంతో సగౌరంగా
వెలుగుతున్న వినయుడు
ఆ చదువులబడికే అంకితమయిన విశ్వసనీయుడు
అతని విధి నిర్వహణలో
సమస్యలు,సంఘర్షణలు హోరెత్తే కెరటాలు
సవాళ్ళ ఒత్తిడి సుడిగుండాలు అతనికేం క్రొత్తగాదు
కోవెలగా కోలాహలమై వున్నా
నిర్మానుష్యమై వెలవెలబోతువున్నా
పనినే నమ్మిన నిస్వార్థుడు
జీతం గురించి
జీవితం పట్ల ఏ బాధలేని
మధురమైనది అతని బతుకు బాట
నాకు తనివితీరని మనసైన పాట
మరలా నేనీ పూట
పల్లవీ ,చరణాలుగా.. పాడుకుంటున్నాను.

-రమేశ్ నల్లగొండ

## వినియోగదారుడు

వినిమయ లోకం ఓ మాయ
ఆ లోకంలో అతడో బోయ
అడుగులో అడుగు పడితే తోవ
అతనితోనే ఆర్థిక చక్రానికి చేవ!.
వినిమయం అనే గడియారంలో
సేవలు అనే అంకెల చుట్టూ
సెకను నిమిషం గంటల ముల్లై
తిరుగు వాడు వినియోగదారుడు!.
మూడు ముళ్లు ముఖ్యమే
ఒకటి కదిలితే మరో దానికి విలువ
గడియారం అన్నప్పుడు
తిరిగితేనె కదా సమయం తెలిసేది!.
వినిమయ వస్తు లోకానికి
వినియోగదారుడే ఇంధనం!
జగత్ రథ ఇరుసు కందెనై తరుగుతు
జగాన్ని మెరిపించువాడతడు!.
అమ్మకాలు కొనుగోలు
బావిలో బొక్కెనేసి చేదుకోలు
వినిమయ ప్రపంచానికి
వినియోగదారుని తోనే వేడుక!.
తాను వత్తి యై కాలుతు
దీపం లో వెలుగు నింపుచున్న
వినిమయ భారాన్ని మోస్తున్న
మరో అవతారమే
వినియోగదారుడు !.

-పి.బక్కారెడ్డి
9705315250

## స్వామి వివేకానంద

శాంత గంభీరవదనం
భారతీయవేషభూషణ సౌందర్యం..
సకలకళా తేజో రూపం
చైతన్యతరంగ స్వరూపం..
అతడే భారతీయ నందనుడు
నరేంద్రుడు..
పురాణ ఇతిహాసాలు
సనాతనసంప్రదాయాలు నమ్మకాలు..
నిరంతర జ్ఞానాన్వేషణ
తార్కిక మేధోమధనం
ప్రశ్నగా వివేకం..
సమాధానమైనఆధ్యాత్మికం..
రామకృష్ణవివేకానందుల
సమావేశం..
విశ్వజాతికి విజ్ఞాన ప్రసాదం..
విశ్వవేదికపై సకల మత సమ్మేళనం..
సకలమత మిళిత సారం..
సర్వధర్మాలసారాంశం..
ఉదాత్త ఉత్తేజిత భావ ప్రసంగం..
ఆలకించి పులకించిన సభ
తన్మయామోద
కరతాళ స్వాగతాలు
విశ్వసౌభ్రాతృత్వం
మానవతా సందేశం
భారతీయ తత్త్వమై
విశ్వవీధిన విహంగ విహారం..
జాతికి మేల్కొలుపు పిలుపు
జాగృతమై - చైతన్యా కృతిగా
సందిగ్ధ సంకోచాలుదాటి
బలహీనతలు వదిలి
సత్యం - ప్రేమ-నిజాయితీ ఆత్మ శక్తితో..
యువతరం నవతరం లేచింది..
సనాతన అధునాతన సమాగమ జ్ఞానం
రామకృష్ణ ప్రభలతో
వివేకానంద జ్యోతియై విశ్వజనీన
విలువలతో అఖండమై,అజరామరమై,
ఉత్సాహతరంగితమై,
యువజనోత్సవమై..
భారతీయ గురుత్వమై
ప్రకాశితమౌతూనే ఉంది.

-గద్దం సులోచన
7702891559

## ఎవరి చెమట చుక్కలో

రోజంతా మోసిన కష్టాన్ని
రాతిరి దిమ్మెపై
కంటి పాప కునుకులో దించి
అలసట తీరి నిద్రిస్తుంటే
కాకి నోటితో చప్పట్లు కొడుతూ
గోడమీద అల్లరి చేస్తుంది
దానికి రోజు ఉదయాన్నే
నా అర్ధ భాగం గింజలు పోసేది
ఆలస్యమైనందుకేమో
అమ్మ అన్నం పెట్టు అని అరుస్తుంది
గుండెకు వినిపించేటట్లు
దానికి మాకు గింజలు మంచి
సంబంధాన్ని అల్లినవి
ఎవరి చెమట చుక్కలు తాగి
ఎదిగినవో గాని
గింజలు కంచుడు లో పోస్తుంటే
చూసి మురిసిపోతూ
ఆలస్యం అయింది
ఎందుకమ్మా అని అడుగుతుంది
మౌనంలో నవ్వుతూ
కాలం కొత్త సంవత్సరాన్ని
తెచ్చింది కదమ్మ
దానితో మంచి చెడ్డలు మాట్లాడడం
వల్ల ఆలస్యమైందనీ చెప్పింది
అమ్మ చేతి మీద వాలి ముద్దు పెట్టి
గింజలు తిని అలా తిరిగి వస్తానని
చెప్పి వెళ్లిపోయింది కాకి.

- గుండెల్లి ఇస్తారి
9849983874

## కోరికల తరాజు

తిరగేయని పేజీలెన్నో?
రాయని కథలెన్నో?
తీరని వెతలెన్నో?
కంచికి చేరాలని
తపించిపోతున్నాయి.
మోయలేనంత
భారంగా మారింది హృదయం...
ఒక్క తనువుకేనా
డైటింగ్ మంత్రాలు,
మరి కోరికల చిట్టాకు లేవా
ఛూ మంతర్లు?
తీరని కోరికల దాహం
మనసుది...
చేతిలో ఉన్న దాన్ని
పక్కన పెట్టేసి
నిత్యం కొత్తదానికై
మనలోని నేను
తొలుస్తూనే ఉంటుంది.
అవసర,అనవసరాలను
తూచడానికి
పాతాళంలో కూరుకుపోయిన
తరాజును వెలికితీయి
రేఖామాత్రం బరువైనా
దిగుతుందేమో!

-డా॥దుగ్గి గాయత్రి రంగరాజు

